# చెదలు

ఎడ్ల బండి పట్టణం నుండి పల్లెకొస్తుంది. ఓ యూరియా బస్తా, నిండు కిరోసిన్ డబ్బా, దానికి గడ్డిని మలిచిపెట్టిన బిరడా. కట్ట కట్టిన కొన్ని ఖాళీ బస్తాలు బండిలోని సామాను.

నిమస్త్రిని, తలపాగ, పెరిగిన గడ్డం, అరవై ఏళ్ళ వయస్సు, కమిషకర్రను గదవకింద పెట్టుకొని తపస్సు చేస్తున్న ఋషిలా కూర్చున్నాడు బండితోలే వ్యక్తి. ఖాళీబండి కావడం వల్ల, ఒకే మేరలో లాక్కొస్తున్న ఎడ్లు, తార్రోడ్డును వదిలి, వాటంతటవే పల్లెకెళ్ళే బండ్ల బాటన నడుస్తున్నాయి. అదిచూసి అక్కడే నిలుచున్న ఓ యువకుడు "ఈ బండి మర్రిగూడెమే వెడుతుందా?" అంటూ అడిగాడు.

అవునన్నట్లు తలవూపాడు బండిలోని వ్యక్తి.

"నేనూ ఆ వూరే వెళ్ళాలి" అంటూ బండి ఎక్కమంటావా అన్నట్లు తనను, బండిని చేయితో, చూపుతూ సైగచేశాడు.

ఎక్కమన్నట్లు తలవూపుతూ, కళ్ళను ఓసారి మూసి తెరిచాడు పగ్గాన్ని లాగిపడుతూ, తన సూట్ కేసును మొదట బండిలోని కాళీ బస్తాలపై పెట్టి బండెక్కాడు.

"ఆ బస్తామీద కూకోండి"

బస్తామీద కూర్చున్నాడు. బండి ముందుకు కదిలింది.

"పర్రిగూడెం ఎవరింటికి?"

"నన్నూ టీచర్‌గా ఈ వూరు వేశారు" టీచర్ అంటే అర్థం అవుతుందో లేదో అనుకుని "అదే బడిపంతులుగా అన్నాడు"

ఐదున్నర అడుగుల ఎత్తు, పాతిక సంవత్సరాల వయస్సు, సింపుల్ వేషదారణ లాల్చీ పైజమా, చురుకైన చూపులు.

బాటంతా ఇసుకచేరి ఉండడం వల్ల బండి చక్రాలు ఇసుకలో వింతశబ్దం చేస్తున్నవి.

చక్రాల కింద రాళ్ళు వచ్చినప్పుడు మాత్రం "కర్" మన్న శబ్దానికి వళ్ళంతా ముల్లెక్కినట్లు అవుతుంది టీచరుకు.

ఎదురుగా వస్తున్న భర్తీబండిని చూసి, తన ఎడ్లపగ్గాలను గుంజి పట్టి, ప్రక్కనుండి పోయే ప్రయత్నం చేస్తున్నప్పుడు ఎదుటిబండి లోని వ్యక్తి-

"ఏం రామన్నా! ధరలెట్లున్నయ్?"

"ఓనాడు మంచిగున్నాయ్! ఎన్నడు ఇంతే! అమ్మబోతె అడవి; కొనబోతె కొరివి. నాపడ్లకైతే చాలాతక్కువ ధరపల్కింది" అన్నాడు

"ఎందుకు?"

"తాలు ఎక్కువుందని, మరి తాలు నేను కలిపితినా? తీరా పొట్ట కొచ్చి పాలు తాగేటప్పుడు, నాలుగు రోజులు కరెంటు రాడాయే, కర్రలు సరిగ్గా పాలుపోసుకోక పొట్ట లవిసి సగానికి సగం తాలాయె పట్టి, చేసి, తీసుకపోయిన ధర పక్కదాయె!"

వాళ్ళ సంభాషణ వింటుంటే ఎలక్ట్రిక్ డిపార్టుమెంటు వారు చేసే సమ్మెలు గుర్తుకొచ్చినవి. వాళ్ళు జీతాలకోసం సమ్మెచేస్తే ఇక్కడ ఈ రైతులకు ఎంత నష్టం జరుగుద్దే అనుకున్నాడు పంతులు.

"బిల్లుకు ఓల్లు తప్పదాయె! పటంతా పాడాయే! ఏం చేస్తం; మనరాత. పొయ్యిరి, ఛర్తీ బండి ఎంతసేపు" అంటూ పగ్గాన్ని కదిలించాడు రామన్న.

ఛర్తీ బండి పట్టణం వైపు, రామన్న బండి పల్లెవైపు సాగినవి. "ఆరుగాలం రెక్కలిరుసుకుని కష్టంచేసి, కరిసేపాము నెరుగక, కొట్టే దొంగ నెరుగక రాత్రింబగళ్లు కంట్లొత్తులు పెట్టుకుని, పిట్టలనుండి, ఎలుకలనుండి, పందికొక్కుల నుండి కాపాడుకొని అమ్మేతందుకు తీస్కపోతే! ఏంచెప్పను?" అంటూ నిమస్తిని జేబులో నుండి ఓ కాగితం తీసి పంతులు కిస్తూ—

"తమరి పేరండి?"

"సత్యం"

"ఇది సదవండి మీకే తెలుసుద్ది" అన్నాడు.

అతని ముఖంలోని కాలం గీసిన ముడతల్లో ఎన్నో బాధలు, ఎన్నో వేదనలు దాగి ఉన్నట్లు కనిపిస్తున్నాయి సత్యం కాగి

తాన్ని చూస్తున్నాడు. దానిమీద "తక్ పట్టి" అని ముద్రించి ఉన్నది. ధాన్యం పేరు, ధర, తూకం, మొత్తం రూపాయలు, మార్కెట్ పన్ను, కాటా ఖర్చు, యింకా యితరములు పోను నగదు అని రాసి ఉన్నవన్నీ చదివి వినిపించాడు.

"చూసింద్రుగ, ఎట్లు దోసుకుంటుంద్రో! ఇవి పోంగ జోకే టోడు, పూకేటోడు అందరికన్నా ఆ కమీషనోడు! ఆడు ఎంత ధర రాష్నిందో సూడు! ఎవరి కందినంత వాళ్లు దోసుకుద్రు. పొలంలో పందికొక్కుల్నుండి కాపాడుకున్నాంగాని, ఈ ఊర పందుల నుండి కాపాడుకోలేక పోతున్నాం" అంటూ సత్యం చేతిలోని కాగితాన్ని తీసుకొని మళ్ళీ జేబులో పెట్టుకున్నాడు.

రామన్న చూపులో ఏదో కసి, రోషం; సత్యం అతని ప్రతి మాటను పరిశీలనగా వింటున్నాడు. పట్టణాల్లో పల్లెల్ని దోచే తీరు మీద ఆలోచిస్తున్నాడు.

వడ్లకు ఇంత తక్కువధర అయితే బియ్యానికి అంత ధరేమిటి?

"గదే ఆలోసించాలి. పండిచ్చిన మా కంటే ఆ కమీషనోదే నయం"

బండి చిన్నగా నడుస్తుంటే ఆలోచనల నుండి తేరుకొని క్రిందికి చూశాడు సత్యం. బండి వాగు దాటుతోంది. వాగునీరు పల్చగా ప్రవహిస్తోంది. చిన్న చిన్న చేపపిల్లలు ఎండకు మెరుస్తూ, తక్కువన నీటిలో మునిగి తేలుతున్నాయి. అక్కడక్కడ ఇసుక తేలినచోట కుప్పకుప్పలుగా కప్పపిల్లలు, కాస్త లోతుగా నీరున్న చోట దున్నపోతులు, బర్రెలు పడుకొని నెమరేస్తున్నవి. పసుల కాడి పిల్లలు చేపలు పట్టడంకోసం గిన్నెలతో నీళ్ళను గుప్పు

తున్నారు వాగు ప్రక్కనే ఉన్న గుంటల్లోకి. బండి వాగునుదాటి దొంకమ్మటి నడుస్తోంది

"నేను గోసి పోసినప్పటి నుండి యెవసాయమే చేస్తున్న. ఎంత సేసిన గొర్రె తోక బెత్తెడే"

"భూమెంతుంది?"

"ఎంతుంటేంది? ఎన్ని పుట్లు పండిస్తేముంది? చేసిన అప్పులు సెదలు తిన్నట్లు తింటుంటే"

ఎప్పుడో ఏదో పత్రికలలో చదివినట్లు గుర్తురాగా "ప్రభుత్వమే తక్కువ మిత్తికి అప్పు ఇస్తుంది కదా?" కదిలిన సూట్ కేసును కాళ్ళ బస్తాలపై పొందిస్తూ అడిగాడు సత్యం.

"యిస్తే అయి చేతికొచ్చేవరకల్లా ఎంత తిరగాలే! ఎంత పైకం కర్సయిద్ది!"

"లంచాలా"

"లంచాలే అనుకో, యిగ కర్సులే అనుకో, అయన్నిపోంగా ఎన్ని రోజులు పనిజెడాలె! ఒకసారి అంజుమన్ అప్పుకోసం రెండేండ్లు తిరగంగ, తిరగంగ ఆరేయిలు మంజూరయితే అండ్ల నుంచి కరుసులే సానాయే! మిగిల్నాటితోటి బాయి తోడిస్తే, తీర్చేటందుకు ఏడెనిమిదేండ్లు పట్టే!" అంటూ గదగోయ పట్టెకు ఆనుకుని రామన్న వైపు చూస్తున్నాడు సత్యం.

"ఇంకోసారి భూతన్క బెంకుకు దరఖాస్తు పెడితే ఆయిలు ఇంజను ఇచ్చిండ్రు. అది ఉన్నన్నాళ్లు పెద్ద శెని ఉండే. అది సెడిపోతే బాగుచేయించే కరుసులకు, కింది పొలం అమ్మి, మీది పొలం పారపెట్టేది. అట్లో అయిదేండ్లు ఆ దండుగ ఖర్చులు పెట్టి,

పెట్టి, పాణం ఏసారి, దాన్ని అద్దికి పావుసేరు అమ్మేసిన" అన్నప్పుడు రామన్న ముఖంలో ఎంతో విసుగు, విరక్తి కొట్టొచ్చినట్లు కనిపించింది.

"కరెంటు మోటారు ఎందుకు పెట్టలేదు?"

"గది పెట్టినంకనే కొంచెం అట్ల అట్ల ఉంది. ఎప్పుడూ కరెంటు వస్తే ఏంకాదు గాని, ఐన మోకల్నే అరకూడా రాదు. దానికోసం కూడ ఎంత తిరగాలే ఎంత కరుసు, చ్చో చ్చో... చ్చో... వాళ్ళయితే ఉగ. జలగలే అనుకో"

సత్యం కుడిచేతిని పిడికిలిగా మూసి నోరుదగ్గర పెట్టుకొని వూదుతూ రామన్నను పరిశీలనగా చూస్తున్నాడు. తనకు ఇంత వరకు తెలియని పాఠం చెప్తున్న లెక్చరర్ లా కనిపించాడు రామన్న.

"అయ్యో య్యొ, మాకున్న బాధలు ఇంకెవరి కుంటాయి? పండిస్తూ వస్తుండటం. కష్టపడుతూనే కరువెల్లదీస్తాం. మా బతుకులు ఆ ఆనదేవుని మీద ఆధారమాయా. ఆన కురిస్తేగాని మాకింత గంజి, గొడ్లకింత గడ్డి"

వ్యవసాయదేశం- అన్నపూర్ణ పాడి పంటలకు పుట్టినిల్లులాంటి మాటల్ని పుస్తకాల్లో చదివిన సత్యం, ఈ వింటున్నదేమిటి? అనుకుంటూ ఆకాశంలోకి చూశాడు. కదులుతున్న మేఘాల్లో ఇండియా మ్యాప్ కనిపించింది, దాన్నిండా రామన్నలే కనిపించారు.

బండి ఆపి, పక్కచేలో మంచెమీదున్న మనిషిని చేయి సైగ చేసి పిలిచాడు రామన్న. మంచెమీది మనిషి దిగివాస్తూ–

"బాగున్నవ రామన్న!" అన్నాడు ఎనుగపిటల నుండి.

"ఆ పోయినోళ్ళంతా పోంగ వున్నోళ్ళం ఇట్లున్నం"

"బండాపి రారాదు! యింత కల్లు తాగిపోదువు! మొగమంతా గుంజకపోయింది"

"ఇగ యాడుంటా, ఎడ్లు నిలబడేటట్లు లేవు గాని రెండు దోస కాయలు, రెండు పచ్చిమిరపకాయలు తెంపుకరా, పొద్దున హోటల్ల పెట్టిన గింత ముద్ద ఏ మూలకు పోయిందో"

"అయితే ఉండు తెస్త" అంటూ చేలోకిపోయి నాలుగైదు దోస కాయలు, కొన్ని పచ్చిమిరపకాయలు దోతి కొంగులో తెచ్చి రామన్నకు అందిచ్చాడు, కొమ్మలను యిరుచుకొని తెచ్చిన కంది మండలను పంతులుకుయిస్తు, "యివి తినండి సార్ బాగుంటయి" అన్నాడు.

"థాంక్స్" అని మళ్ళీ తెలుగులో "అలాగా" అంటూ నవ్వుతూ అందుకున్నాడు.

"మరి పొయ్యొస్తా ఇంటికాడ పిల్లల్ని అడిగినవ్ని చెప్పు" అంటూ ఎడ్లను విదిలించాడు రామన్న. అప్పటి వరకు కండ్లు మూసుకుని నెమరేస్తున్న ఎడ్లు కదిలినవి. బండి ముందుకు కదిలింది.

సత్యం కంది కాయల్ని వొలుచుకొని తింటున్నాడు. రామన్న మొలతాడుకున్న కీలీ కత్తితో దోసకాయను చెక్కుతీస్తున్నాడు. చెక్కు తీసినపుడు లోపల తెల్లటి భాగమంతా రామన్న చేతుల కున్న మట్టి అంటి రంగు మారుతున్నది. చెక్కు తీసిన కాయను నాలుగు భాగాలుగ కోసి రెండు భాగాలను సత్యానికియ్యబోయాడు రామన్న.

"నాకు కందికాయలు బాలు రామన్నా! నీవు తిశెసెయ్"

"నీ ఇష్టం" అంటూ దోసముక్కల్ని నములుతూ మధ్య మధ్య పచ్చిమిరపకాయల్ని కొరుక్కుని తింటున్నాడు రామన్న కళ్ళలో ఆదోమాదిరి తృప్తి కదులుతుంది. "ఉప్పుంటే బాగుండు" అన్నాడు రామన్న మొత్తం కాయల్ని తిని బ్రేవ్‌మంటూ చేతుల్ని బండిలో ఉన్న ఖాళీబస్తాలకు తుడుస్తూ.

"పొద్దున రెండున్నర తీసుకొని గింత అన్నం ఇచ్చి, మూడు నాలుగు కూరలు, మల్ల యింత చారు, ఏం‌చేసుకోను?"

"ఒక కూర కాకున్నా మరో కూరతో తింటారని" అన్నాడు సత్యం నవ్వుతూ.

"గవన్నీ మాకెందుకు? కడుపు నిండేది ఒక్కటే లెక్క"

"కూర ఒక్కటైన కాస్తంత రైస్ అదే అన్నం ఓ ముద్దెక్కువ వుండాలంటవ్"

"గంతే గదమరి! ఆకలి రుసి ఎరుగుద్దా!" అంటూ తలపాగా కొంగును నోట్లొపెట్టి వూది వెంటనే దాన్ని కన్నుకు అద్దుకున్నాడు.

"ఏమైంది కళ్ళెర్రగైనయి" రామన్న కళ్ళవైపు చూస్తూ అన్నాడు సత్యం.

"మిడత తగిలింది. యిట్ల అయి పెడితే పోద్ది"

కొంతసేపు మౌనంగా గడిచింది.

"పంతులూ! సర్కార్ అప్పులిచ్చి మిత్తీతో సహా వసూలు చేస్తుండ్రు. లేకుంటే గొర్రెల్ను, నగల్ని, గిన్నెల్ని గుంజుకు పోతుండ్రి. కరెంటోడు కరెంటిచ్చి బిల్లు తీసుకుంటునే కొంచెం ఆలిసం అయితే ఫీజు పీకుపోతుండె మరి మేం కట్టె పన్నులు

ఏంచేస్తున్నట్లు? నాకెరుక లేక అడుగుతా" అంటూ సత్యం వైపు చూశాడు రామన్న.

కందికాయలను తినడం ఆపి, "ప్రజలిచ్చే పన్నుల్ని తిరిగి ప్రజలకే ఖర్చుపెడతారు. దవాఖానాలు పెట్టి అందరికి ఉచితంగా మందులిస్తారు. పాఠశాలను కట్టించి మీ పిల్లలకు చదువు చెప్పిస్తారు. న్యాయస్థానాలు, పోలీసులను పెట్టి అందరికి రక్షణ కల్పిస్తారు. ఇలానే ఇంకా ఎన్నో..." అంటూ కందికాయల్లో, విందుకాయల్ని వెదుకుతున్నాడు.

"మా వూరు పంతులు చదువు చెప్పడు! పంచాదులు చెపుతడు" సత్యానికి నవ్వొచ్చింది.

"ఈనాటి పంతుళ్ళు తన స్థానం కోల్పోయి రాజకీయాల్లో చిక్కుకుని, పైరవికార్లగా మారుతున్నందుకు నాకు బాధగానే ఉంది" అన్నాడు సత్యం.

"యిగ దవాఖానాల సంగతంటర" అంటూ ఒక్కసారే మౌనం వహించాడు రామన్న. బండి రాళ్ళబాటన నడుస్తుండటంవల్ల కదిలి వూపేస్తుంది.

"చెప్పు - రామన్నా! చెప్పు. నీవు చెప్పేదంతా నిజమే"

"ఏం నిజమో - ఏం లోకమో"

"దినదినానికి మనిషి రాచ్చసైపోతుంటె... బతుకుల్లో సుఖం యాడుంటది పంతులు" రామన్న వేదాంతిలా చెప్తుంటే సత్యం వింటూ జీవితంలోని చేదు నిజాలగూర్చి ఆలోచిస్తున్నాడు.

"ఏం చదువుకోకున్నా ఇంత జ్ఞానాన్ని ఎలా నేర్చుకున్నావు రామన్న!"

"పాపకు నీళ్ళు ఈఁత నేర్పినట్టే, నాకు ఈఁ ఒతుకే నేర్పింది పఁతులు"

"ఏదో ఎడ్డిసన్నాసులం! అందుకే మాకిన్ని కష్టాలు" కొన్ని నిముషాల తర్వాత-

"తమరెదో దవాఖానాలు అన్నరు కదూ? ఆటి సంగతి..."

"చెప్పు" అన్నాడు సత్యం కాస్త కదిలి కూర్చుఁటూ

"మొదటి కానుపు మా ఇంటికాడనే చెయ్యాలని, నా బిడ్డను అత్తగారింటినుండి తీసుకొచ్చిన. దినమంతా ఆపతిపడ్డా నీల్లాడలేదు. యీడ ఈలుగాదని దవఖానాకు తీసుకుపో అని మంత్రసాని చెపితే, బండికట్టుకొని దవఖానాకు పోయేసర్కి గోరుకొల్లు పొడిసి బారెడెక్కినయి. అందరూ నిద్రపోతుంద్రు. కాళ్ళేల్లు మొక్కంగా లేసింద్రు. డాక్టరు చూసి ముక్కిరిసి, ఆప్రెసన్ చేయాలనె. ఆయన కిందాయన పక్కకు పిలిసి మరి డబ్బుతెస్తివా అని అడిగె! లేదు, బాటకరుసుకు ఐదో పదో తెచ్చుకున్న అంటే పెద్దాపరేషన్, శానా కావాలనే. తెల్లరినంక వూర్కిపోయి తెచ్చిస్తనంటే మంచం కాలీలేదనే డాక్టర్. మంచం లేకుంటే మానె మందన్న ఇయ్యంద్రి కింద పండుకుఁటం, అని తల్లెంతో బతిలాదే! ఎవరు యినరైరి. మమ్ములను బయటికి నూకేసి పాటకి మూసుకుంద్రి" అంటూ ఆగాడు రామన్న.

"చ్చో...చ్చో..." అన్నాడు సత్యం తనకు తెలియకుండనే

"బండిని ఎదురుగా ఉన్న ఏపచెట్టు క్రింద యిడిసి, ఇంత గడ్డిని బండి క్రిందేసి, దాఁట్లో నా బిడ్డను పడుకోబెట్టి, తల్లిని మంత్రసానిని ఉంచి, వుర్కుఁటబోయి డబ్బు తీసుకొని వస్తలకు-!

"ప్రసవించిందా?" అడిగాడు సత్యం ఆతురతగా.

రామన్న ఒక్కసారి పిచ్చివానిలా నవ్వాడు.

"భూమ్మీదికి రావల్సిన పసిగుడ్డు రాలేక కడుపులోనే సచ్చింది. బిడ్డను కనుకోవాలని తల్లి తన్నుకొని, తన్నుకొని సచ్చింది. పిచ్చి దానిలా ఏడుస్తూ నెత్తినోరు కొట్టుకుంటూ దవఖానా మీద మన్ను పోస్తువుంది నా భార్య". అన్నప్పుడు రామన్న గొంతు జీరపోయింది

గుండెలోనే బాధను దిగమింగుతూ, "ఋప్పుడు సెప్పు పంతులూ? నేను ఏళేట పన్నులు కడతనే ఉన్నాగదా మరి నా బిడ్డనుకు ఎందుకు మంచం లేదాయే? ఎందుకు మందు దొరకదాయే?" అంటూ సత్యం వైపు చూశాడు.

"అన్యాయం...అన్యాయం..."

రామన్న కళ్ళల్లో నీళ్ళు తిరిగినై! ముక్కుత డైంది. గొంతు ఆవిరిలాంటి వేడిని వొదిలింది.

"బిడ్డ అట్లచచ్చే... కొడుకేమో..." "కొడుకూ?" అంటూ రామన్న వైపు వంగి ముఖంలోకి చూశాడు.

"సావలే! సంపింద్రు"

"ఎవరు?"

"తెలవదు!" రామన్న గొంతులో మార్పొచ్చింది.

"పన్నెండోది పాసయినంక పట్నం సదువుకని పోయిండు. రెండేండ్లు బాగానే సదివిండు. ఓనాడు ఆయనతోటి చదువుకునే సోపతిగాల్లు, రక్తంముద్దైయిన పీనిగను మా వూర్కి తీసుకొచ్చింద్రు అది సూసి తల్లి నోటిమాట పడిపాయే, ఎవరు సంపింద్రంటే పోలీసోల్లని సోపతిగాల్లనిరి. పోలీసోల్లనడిగితే, పేంగాదు నీవు

కథా నిలయం
691

ఓటేసి గెలిపించిన నాయకులనిరి! ఈయాల్టివరకు ఎవరు సంపింది తెలియకపాయే! ఏడ్చేడ్చి నాకన్నీరింకిపోయే"అని ఆగాడు రామన్న.

ఇద్దరి మధ్య విశ్శబ్దం.

బండి నడుస్తూనే ఉంది. బాటకు రెండువైపుల బాగా పెరిగిన సర్కార్ కంపచెట్లు, బాటకు అవరోధంగా వంగివున్నాయి. బండి ఇరుసులో నూనె ఎండిపోయిందేమో అది కిర్ర్ కిర్ర్ మంటుంది.

సత్యం కళ్ళముందు, విద్యార్థుల మూవ్మెంట్స్, వాటిని వాడుకునె అవకాశవాదులైన రాజకీయనాయకులు కదిలారు.

"చెప్పు? ఇక చెప్పు పంతులు? నేను ఓటేస్తునే ఉంటి నా కొడుకునెందుకు సంపిండ్రు? మరి మాకు రచ్చన ఏది?" అంటూ సత్యంవైపు చూశాడు.

సత్యం మౌనంగా చూస్తున్నాడు. ఎవరు కారకులు వీటికి, ఎన్నడు అంతం వీటికి? ఇలాంటి ఆలోచనలతో తల బరువెక్కింది.

బండి చెరువుకట్ట ఎక్కింది, చెరువునిండా నీరుంది. పడమరకు వంగిన సూర్యుణ్ణి చెరువు మింగుతున్నట్లుంది, చెరువులో నీరంతా ఎరుపు పసుపు కలిపిన బంగారు రంగును పులుముకుంది.

ఉన్నట్లుండి బండి ఆగింది.

ఎద్దు బుసకొడుతూ కదలక నిలుచున్నాయి. ముందుకు చూచిన సత్యం "పాము! పాము!" అంటూ అరిచాడు. పామును చూచిన రామన్న అలాగేలేచి నిలుచొని, చేతిలోని కమిషకర్రను తొట్లోనే వేసి—

"పో, నీ తోవన నీవు పోతల్లి, బాటలెందుకున్నావ్?" అన్నాడు రామన్న చేతులు జోడించి.

వెంటనే పాము పడగ దించుకొని పక్కపొదల్లోకి పోయింది.

రామన్న తొర్రలోని కమీషకర్రను చేతిలోకి తీసుకుని, ఎడ్లను అదిలించాడు.

బండి కదిలింది.

సత్యం ఆశ్చర్యచకితుడై -

"కర్రైతె కింద పడేస్తే పాము పైకొస్తుందనుకున్న"

సత్యం మాటలకు రామన్న ముఖంనిండా నవ్వును నింపుకొని, "కర్రైతె కిందపడేస్తే మీదికొచ్చేది ఒక్క మనిషే" అని అన్నాడు.

సత్యం వళ్ళు జల్లుమంది.

శిలువ మీదున్న క్రీస్తులా కనిపిస్తున్నాడు రామయ్య సత్యానికి. సత్యం చూపులు రామయ్యమీద. ఆలోచనలు రామయ్య సమస్యల మీద కట్టదిగుతుంటే పగ్గాలులాగి బండినాపి, "వూరొచ్చింది దిగు తర పంతులు"

నీవు రావా అనబోయి "మీరూ ఊళ్లోకిరారా" అన్నాడు బండి దిగుతూ.

"రాను, వూళ్లై ఏముంది నాకు? అక్కడే బాయి దగ్గరే వుంటున్న"

"మీకు తీరికున్నపుడు ఓసారి కలవండి, లేదా నేనైనా మీ బావి దగ్గర్కి వస్త" అంటూ సత్యం బండిదిగి సూట్‌కేసును దించుకోగానే బండి బావివైపు పరుగు తీసింది.

ఊరివైపు నడుస్తున్న సత్యం తలనిండా ప్రశ్నలే!

కరెంటు బిల్లు కడుతున్నా చేన్లు ఎండిపోతునేవున్నై? పన్నులు గడుతున్నా దవాఖానాలో నా బిడ్డకు మంచం ఎందుకు దొరకలే?

కనీసం మందైనా ఎందుకు దొరకలేః ఓ చేస్తునే ఉన్నా నా కొడుకు రక్షణ ఎందుకు లేదాయేః కర్ర కిందేస్తే పైకొచ్చేది ఒక్కమనిషే! ఇంత వరకు చదివిన పాఠాల్లో వీటికి జవాబు ఎక్కడాలేదు. అనుకుంటూ ఊళ్ళోకి ప్రవేశించాడు.

అప్పుడే ఊరు చేరుతున్న పశువుల డెక్కలు లేపిన దుమ్ము సత్యాన్ని ఉక్కిరి బిక్కిరి చేసింది.

ఊళ్లోని వేపచెట్ల మీద చింతచెట్ల మీద కొంగలు వీపరీతమైన శబ్దం చేస్తున్నవి.

ఇండ్లలో మిణుకు మిణుకు మంటున్న దీపాలను చూస్తూ నడుస్తున్న సత్యం కళ్లు వెదుకుతున్నాయి “బడికోసం”